ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
గురువారం 29 ఆగస్టు 2024





మైసిగండిలో బోనాల సంబురం

గండి మైసమ్మ తల్లో.. మమ్ము చల్లంగా చూడంటూ.. మైసిగండిలో భక్తులు మైసమ్మ దేవతను వేడుకున్నారు. కడ్తాల మండలం మైసిగండి గ్రామంలో బోనాల వేడుక అంబురాన్నంటింది. గౌడ సంఘం ఆధ్వ ర్యంలో బుధవారం సాయంత్రం మైసమ్మ బోనాల పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు పట్టు వస్త్రాలు ధరించి బోనాలను అందంగా అలంకరించు కొని ర్యాలీగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ వేడుకల్లో పూనకాలు, పోతరాజుల విన్యాసాలు ఆకర్షణగా నిలిచాయి.



బోనాలతో మహిళలు



యాచారంలో వరి నాట్లు వేస్తున్న కూలీలు

ఆశల సాగు

ఈ ఏడాది ఆశించిన మేర వర్షాలు లేకపోయినా అడపాదడపా కురుస్తున్న వానాలకు రైతులు వరి నాట్లు ముమ్మరం చేశారు. చెరువులు, కుంటల్లో నీరు లేకపోయినా బోరు బావులు ద్వారా అందించవచ్చనే ఆశతో సాగు చేస్తున్నారు. ఇప్పటికీ మండలంలోని పలు గ్రామాల్లో నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. సాధారణ విస్తీర్ణం 5,764 ఎకరాలకు గాను ఇప్పటి వరకు కేవలం 1,721 ఎకరాలలో వరి నాట్లు వేశారు. ఈ సారి సాగు గణనీయంగా తగ్గే అవకాశముందని అధికారులు పేర్కొంటున్నారు.

-యాచారం, ఆగస్టు 28

చేవెళ్ల ఎమ్మెల్యేకు నిరసన సెగ

- గోబ్యాక్ అంటూ సొంత పార్టీ నాయకుల నినాదాలు
- కోడిగుడ్లతో దాడి.. గంటపాటు ఆందోళన



ఎమ్మెల్యే కాలె యాదయ్య వాహనాన్ని అడ్డుకొని నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

షాబాద్, ఆగస్టు 28: ఇటీవలే కాంగ్రెస్ పార్టీలో చేరిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యకు సొంత పార్టీ నేతల నుంచే నిరసన సెగ తగిలింది. కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ విషయమై ఆయన బుధవారం షాబాద్ మండలానికి రావడంతో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు కోడిగుడ్లతో దాడి చేసి గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. పదేళ్ల నుంచి కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసిన వారిని గుర్తించకుండా బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారిని వెంట వేసుకొని తిరుగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమతో మాట్లాడే వరకు మండలానికి రానిచ్చేది లేదంటూ వాహనానికి అడ్డుతగిలారు. సుమారు గంటకు పైగా కార్యకర్తలు నిరసన తెలుపుతున్నా ఎమ్మెల్యే మాత్రం కారు దిగి రాలేదు. దీంతో ఎట్టకేలకు ఇన్స్పెక్టర్ కాంతారెడ్డి, క్రైం ఇన్స్పెక్టర్ రమేష్ నాయుడు, ఎస్సైలు కాంతారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, సీనియర్ నాయకులు తమ్మలి రవీందర్ వారిని సముదాయించి అక్కడి నుంచి పంపించారు. చివరకు పటిష్ట భద్రత మధ్య ఆయన లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసి వెళ్లిపోయారు. పార్టీ సీటుపై ఎన్నికల్లో నిలిచి ఓడిపోయిన భీంభరత్ , ఆయన వర్గీయులను, పార్టీ సీనియర్లను చాలా మందిని ఎమ్మెల్యే పట్టించుకోక పోవడం, పదేళ్ల క్రితం కాంగ్రెస్ టికెట్‌పై గెలిచి బీఆర్ఎస్‌లో చేరి రాజభోగాలు అనుభవించి, మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పార్టీలో చేరడంపై ఆగ్రహంతోనే ఈ దాడికి దిగినట్లు తెలుస్తోంది.



అభివృద్ధి పనులపై ఆరా తీస్తున్న డీఈఓ

ప్రైవేట్‌కు దీటుగా ఉత్తీర్ణత సాధించాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు

మహేశ్వరం, ఆగస్టు 28: ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత సాధించాలని అందుకోసం ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని కోళ్లపడకల్ ప్రభుత్వ పాఠశాలను ఆయన సందర్శించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేయాల్సిన పనుల వివరాలు, మధ్యాహ్నభోజనం సరఫరా, విద్యాబోధన, ఉపాధ్యాయుల హాజరువంటి వివరాలను ఎంఈవో కృష్ణను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేటు పాఠశాలకు దీటుగా వసతులు ఉండాలన్నారు. అలాగే ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని లేని పక్షంలో చర్యలు తప్పవన్నారు. మధ్యాహ్న భోజన సమయంలో తాగునీరు కొరత రాకుండా చూడాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలకు ఎంపికైన ప్రతీ పాఠశాలలో నిబంధనల ప్రకారం చేయాల్సిన ప్రతీ పనిని త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శైలజారెడ్డి, తదితరులు ఉన్నారు.



గుంతలుగా మారిన కొత్తూరు మండలం తిమ్మాపూర్-గూడూరు రోడ్డు

పల్లె రోడ్డు ఛిద్రం!

అసలే అధ్వాన రోడ్లు.. ఆపై వర్షాకాలం. ఇంకేముంది చిన్న చిన్న వానలకే పల్లె రోడ్లు పూర్తిగా ఛిద్రమవుతున్నాయి. ఈ మట్టి రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి బురదమయంగా మారుతున్నాయి. దీంతో వాహనదారులు ఆ రోడ్లపై ప్రయాణించాలంటేనే బెంబేలెత్తిపోతున్నారు. ఇక పాదచారుల పరిస్థితి మరీ అధ్వానం. దీంతో ఆయా గ్రామాలకు అంబులెన్స్‌లు, ఆర్టీసీ బస్సులు కూడా రాని దుస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో ప్రయాస లేకుండా రోడ్లపై ప్రయాణం చేయలేని పరిస్థితి నెలకొంది. కాగా, ఇంకా పదుల సంఖ్యలో గ్రామాలు కనీస రోడ్డు వసతికి నోచుకోవడం లేదు. అక్కడక్కడున్న బీటీ రోడ్లకు మరమ్మతులు లేకపోవడంతో అవి కూడా పూర్తిగా ధ్వంసమయ్యాయి.



గుంతలమయంగా రెడ్డిపాలెం - రాగ్య తండా రోడ్డు

- బురద, గుంతలు, కంకరతేలి అధ్వానం
- అంబులెన్స్, ఆర్టీసీ బస్సు వెళ్లలేని దుస్థితి
- నేటికీ చాలా గ్రామాలకు రోడ్లు కరువు
- ఉన్నచోట మరమ్మతులు లేక ఆందోళనకరం
- నరకప్రాయంగా ప్రయాణం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

చిన్న వర్షానికే ఆగమాగం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్): ప్రభుత్వాలు, పాలకులు మారినా గ్రామాలకు వెళ్లే రోడ్ల స్థితిగతులు మాత్రం మారడం లేదు. నేటికీ పలు మారుమూల గ్రామాలకు, తండాలకు రోడ్డు కలగానే మిగిలిపోయింది. ఉన్న మట్టి రోడ్లు ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలు పడి, బురమయంగా మారాయి. దీంతో ఆ రోడ్లపై ప్రయాణం చేయడానికి నరకయాతన పడాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. ఈ రోడ్లపై వాహనాలు దెబ్బతినడం, గుంతల్లో ఇరుక్కుపోవడం, అత్యవసర సమయాల్లో 108 అంబులెన్స్ సైతం రాలేని దుస్థితి నెలకొంది.

రోడ్లపైనే నిలుస్తున్న నీరు

జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజవర్గాల్లో మొత్తం 27 మండలాలున్నాయి. అందులో 21 గ్రామీణ మండలాలే. స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు దాటినా ఇప్పటికే అనేక గ్రామాలు బీటీ రోడ్డుకు నోచుకోని దుస్థితి. ఆయా గ్రామాల ప్రజలు నేటికీ మట్టి రోడ్లపైనే ప్రయాణం సాగిస్తున్నారు. వర్షాకాలం నేపథ్యంలో రోడ్లపై నీళ్లు నిలిచి అధ్వానంగా మారాయి. బురదమయమై చిత్తడిగా మారడంతో ఆ రోడ్ల వెంట నిత్యం ప్రయాణించే రైతులు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. నడిచేటప్పుడు బురదలో ఏ మాత్రం కాలు జారినా అంతే సంగతులు. వర్షం పడిన ప్రతీసారి ఆయా గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. మట్టి రోడ్ల పరిస్థితి ఇలా ఉంటే ఉన్న కాస్త బీటీ రోడ్లకు ఏళ్ల తరబడి మరమ్మతులు చేయకపోవడంతో పూర్తిగా దెబ్బతిన్నాయి. కంకర తేలి, గుంతలు పడి వర్షానికి నీరు నిలిచి బురదమయంగా మారాయి. దీంతో వాహనాలు ముందుకు సాగని దుస్థితి.

మరుమూల గ్రామాల్లో ఆందోళనకరం

షాబాద్ మండలంలోని ఎర్రోనిగూడ, గోపిగడ్డ, పోలవరం, రేగడి దోస్వాడ నుంచి బొబ్బిలిగామ వరకు మట్టి రోడ్లే ఉన్నాయి. ఆ గ్రామాలు ఇప్పటికీ బీటీ రోడ్లకు నోచుకోవడం లేవు. ఎర్రోనిగూడ, కేసారం, అప్పారెడ్డిగూడ, దామర్లపల్లి గ్రామాల రోడ్లు అధ్వానంగా ఉండటంతో ఆ గ్రామాలకు బస్సు కూడా రాని పరిస్థితి నెలకొంది. దీంతో ఆటోలు, ద్విచక్రవాహనాలు, ఇతర వాహనాల ద్వారా షాబాద్ టౌన్‌కు వస్తున్నారు. కొత్తూరు మండలం రెడ్డిపాలెం నుంచి రాగ్య తండాకు వెళ్లే మట్టి రోడ్డుతో తండావాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే తిమ్మాపూర్-గూడూరు రోడ్డు గుంతలుగా మారడంతో వాహనాల దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శంకర్‌పల్లి మండలం పొన్నగుట్ట తండాకు రోడ్డు సౌకర్యం సరిగ్గా లేకపోవడంతో గిరిజన ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. పొన్నగుట్ట తండా, కాకర్ల గుట్ట, ఇరుక్కుంట తండా, మాసానిగూడ గ్రామాలకు కూడా రోడ్డు సౌకర్యం అంతంత మాత్రంగానే ఉంది. దీంతో ఈ గ్రామాలకూ ఆర్టీసీ బస్సు రావడం లేదు. జిల్లేడు చౌదరిగూడ మండలం లాల్‌పహాడ్ నుంచి చలివేంద్రపల్లి వరకు బీటీ రోడ్డు ఉన్నా అది పూర్తిగా ధ్వంసమైంది. నందిగామ మండలం నర్సప్పగూడకు కంకర రోడ్డే దిక్కైంది. దీంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు.



అధ్వానంగా శంకర్‌పల్లి మండలం పొన్నగుట్ట తండా రోడ్డు



షాబాద్ మండలం
మల్లారెడ్డిగూడ గేట్ నుంచి ఎర్రోనిగూడ రోడ్డు

మా ఊరుకి బస్సు రావడం లేదు



సరైన రోడ్డు సౌకర్యం లేక మా ఊరికి ఆర్టీసీ బస్సు రావడం లేదు. ప్రభుత్వం వెంటనే బీటీ రోడ్డు మంజూరు చేయాలి. బస్సురాక విద్యార్థులు ప్రైవేట్ వాహనాల్లో ప్రమాదకరంగా ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలి.

-సంతోషి కుమారి, మాజీ సర్పంచ్, ఇరుక్కుంట తండా

గుంతలతో నిత్యం ప్రమాదాలు



వర్షాకాలంలో రోడ్లన్నీ గుంతలతో బురదమయంగా మారడంతో విద్యార్థులు స్కూల్‌కి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రాత్రి పూట ద్విచక్ర వాహనదారులు గుంతల్లో పడి ఆసుపత్రుల పాలవుతున్నారు. ఇప్పటికే ఎంతో మంది గాయపడ్డారు. అధికారులు స్పందించి అంతారం స్టేజి నుంచి గ్రామం వరకు బీటీ వేయాలి.

-సత్యనారాయణ, మన్మర్రి, షాబాద్ మండలం

కంకర రోడ్డుతో నరకం



రోడ్డు సరిగాలేక మా ఊరుకి వెళ్లేందుకు నానా ఇబ్బందులు పడుతున్నాం. కంకర రోడ్డుపై ప్రయాణం కష్టంగా మారింది. బైకుల టైర్లు పాడవుతున్నాయి. అయినా నేటికీ బీటీ రోడ్డుకు నోచుకోవడం లేదు. రోడ్డు నిర్మాణం పనులు సగం వరకే చేసి వదిలేశారు. వేసిన కంకర రోడ్డును వెంటనే బీటీ రోడ్డుగా మార్చాలి.

-కాట్న సురేందర్, నర్సప్పగూడ, నందిగామ మండలం



ర్యాలీలో నాయకులు, మహిళలు

ఘనంగా తీజ్ వేడుక



మొలకల బుట్టలతో యువతులు

కడ్తాల్, ఆగస్టు 28: మండల పరిధిలోని బాలాజీ నగర్ తండాలో బుధవారం తీజ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో వివిధ ప్రాంతాల్లోని గిరిజనులు తండాకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అతిథులకు మొలకలను అందజేసి ఘన స్వాగతం పలికారు. మాజీ సర్పంచ్ కమ్లీ బీచ్యనాయక్ ఆధ్వర్యంలో ఉత్సవాలకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ముందుగా మొలకల బుట్టలను స్థానిక ఆలయాలలో ఉంచి పూజలు నిర్వహించారు. అనంతరం పెళ్లి కాని యువతులు, చిన్నారులు మొలకల బుట్టలతో తండాలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో యువకుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం మొలకల బుట్టలను సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు రాజారాం, రమేశ్, నాయకులు టాక్రు, పాండు, రాజు, సేవ్య, రమేశ్, శంకర్, శ్రీను, చంద్రు, లచ్చిరామ్, పూర్య, వస్య, గణేశ్, జయరామ్, తదితరులు పాల్గొన్నారు.

ఓయో గదుల్లో రహస్య కెమెరాలు

- తనిఖీలు చేసిన పోలీసులు.. యజమాని అరెస్టు



శంషాబాద్, ఆగస్టు 28: లాడ్జిలోని గదుల్లో రహస్య కెమెరాలు ఏర్పాటు చేసి రికార్డు చేస్తున్న లాడ్జి యజమాని గణేశ్‌ను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఆర్జీఐఏ సీఐ బాలరాజు తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు రోడ్డులో సిటాగ్రాండ్ ఓయో హోటల్‌ను ఆంధ్రప్రదేశ్ ఒంగోలు పట్టణానికి చెందిన పీ.గణేశ్ అద్దెకు తీసుకొని నిర్వహిస్తున్నాడు. హోటల్‌కు కస్టమర్లు ఎక్కువగా వస్తుండటంతో హోటల్ గదుల్లో రహస్యంగా సీసీ కెమెరాలను అమర్చి అశ్లీల దృశ్యాలను రికార్డు చేసి వాటి ద్వారా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. కస్టమర్లకు అనుమానం రాకుండా బెడ్ రూంలలోని విద్యుత్ బల్బ్ హోల్డర్‌లలో సీసీ కెమెరాలను అమర్చాడు. ఇలా రికార్డు చేసిన దృశ్యాలను తన సెల్‌ఫోన్ ద్వారా సొమ్ముచేసుకుంటున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఆకస్మికంగా ఆ హోటల్‌ను తనిఖీ చేసి గదుల్లోని కెమెరాలతో పాటు రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి మొబైల్‌లో కొంతమంది యువతులకు సంబంధించిన ఫొటోలు ఉన్నట్టు తెలిపారు. ఈ మేరకు అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.

అత్యవసరంగా ఎయిర్‌ఇండియా విమానం ల్యాండింగ్

శంషాబాద్, ఆగస్టు 28: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఓ ఎయిర్ ఇండియా విమానం బుధవారం అత్యవరంగా ల్యాండ్ అయింది. ఎయిర్‌పోర్టు వర్గాల కథనం ప్రకారం.. కేరళలోని కొచ్చిన్ విమానాశ్రయం నుంచి ఢిల్లీ వెళ్తున్న ఎయిర్ ఇండియా విమానానికి మెడికల్ ఎమర్జెన్సీ రావడంతో తప్పనిసరై ల్యాండ్ చేసినట్లు సమాచారం. విమానంలో ప్రయాణిస్తున్న ఓ మహిళ తీవ్ర అస్వస్థతకు గురికావడంతో వెంటనే శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ చేశారు. ఆ తరువాత సిబ్బంది సహాయంతో ఆ మహిళను విమానాశ్రయంలోని అపోలో ఆసుపత్రికి తరలించారు. కాగా, ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ఆమె మృతి చెందిందని ఆసుపత్రి వైద్యులు ధ్రువీకరించారు. కాగా ఆమె మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

కనుల పండువగా పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ

మూడుచింతలపల్లి, ఆగస్టు 28: పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపను కనుల పండువగా నిర్వహించారు. మూడుచింతలపల్లి మండలం ఉద్దెమర్రి గ్రామంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠను వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య భక్తులు కోలాహలంగా నిర్వహించారు. గ్రామాల భక్తులు అమ్మవారికి పూజలు చేశారు. ఈ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. అమ్మవారి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠానంతరం పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

వాల్మీకి మహర్షి ఆశయసాధనకు కృషి

దోమ, ఆగస్టు 28: దోమ మండలం బ్రాహ్మణపల్లిలో బుధవారం బోయి సోదరుల ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ బోయ కులస్తులు వాల్మీకి మహర్షిని భక్తిశ్రద్ధలతో పూజిస్తారని తెలిపారు. ఆయన ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాఘవేందర్‌రెడ్డి, నర్సప్ప, బోయలు పాల్గొన్నారు.


వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠాపనలో గ్రామస్తులు

విద్యార్థులు లక్ష్యసాధనలో ముందుండాలి

ఘట్‌కేసర్, ఆగస్టు 28: విద్యార్థులు లక్ష్య సాధనలో ముందుండేలా నిరంతరం శ్రమించాలని రాచకొండ కమిషనర్ ఆఫ్ పోలీస్ జి.సుధీర్ బాబు అన్నారు. బుధవారం పోచారం మున్సిపాలిటీ యంనంపేట్‌లోని శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ నూతన విద్యార్థులకు నిర్వహించిన ఓరియంటేషన్ కార్యాక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇంటర్ పూర్తయి బీటెక్‌లో చేరిన తర్వాత విద్యార్థులు స్వేచ్ఛ వచ్చినట్లు భావిస్తారన్నారు. విద్యార్థులకు బీటెక్ మొదటి సవత్సరమే ఎంతో కీలకమన్నారు. ఈ సంవత్సరమే విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయింస్తుందన్నారు. అనుకోని విధంగా మొదటి సంవత్సరం సబ్జెక్టుల్లో ఫెయిలైతే ఆ భారం తదుపరి సంవత్సరాలపై పడుతుందన్నారు. తోటి విద్యార్థుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రధానంగా సిగరెట్లు తాగడం, డ్రగ్స్ వినియోగించడం వంటి పనులకు దూరంగా ఉండాలన్నారు. కంపు వాసన వచ్చి, రోగాలకు కారకం అయ్యే సిగరెట్లు ఎందుకు తాగుతారు? అని ప్రశ్నించారు. పలు రాష్ట్రాల వారు, రకరకాల కుటుంబ నేపథ్యాలున్న కుటుంబాల విద్యర్థులు ఒకే క్యాంపస్‌లో చదువుకుంటున్నప్పుడు విచక్షణతో వ్యవహరించాలన్నారు. సమస్యల్లో చిక్కుకోకుండా సజావుగా విద్యాభాసాన్ని పూర్తి చేయాలన్నారు. పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పక ఉండాలన్నారు. మొబైల్ ఫోన్‌ను అవసరానికి ఉపయోగపడే సాధనంగానే చూడాలన్నారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ విద్యారంగంలో రాణించేందుకు శ్రమించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సీఈఓ కె.అభిత్‌రావు, ప్రిన్సిపల్ టీసీహెచ్.శివారెడ్డి, డీన్ కొండయ్య, పూర్వ ప్రిన్సిపల్ నర్సింహారెడ్డి, డీన్‌లు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఓరియంటేషన్‌లో మాట్లాడుతున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

సమస్యాత్మక ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి : సీపీ

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 28 : పోచారం ఐటీసీ పోలీస్‌స్టేషన్‌ను బుధవారం రాచకొండ సీపీ సుధీర్‌బాబు సందర్శించారు. పోలీసులు, సిబ్బంది పనితీరును ఆయన అడిగితెలుసుకున్నారు. పీఎస్ పరిధి సమస్యాత్మక ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో మల్కాజ్‌గిరి ఏసీపీ చక్రపాణి, సీఐ రాజువర్మ, ఎస్‌ఐలు నాగార్జున్‌రెడ్డి, శివకృష్ణ, కృషయ్య, నాగేశ్వర్‌రావు. యుగేందర్, సిబ్బంది పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు



అగర్‌మియాగూడలో రైతులతో మాట్లాడుతున్న కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి

ఫోర్త్‌సిటీతో కందుకూరు మరింత అభివృద్ధి

కందుకూరు, ఆగస్టు 28: రాష్ట్ర ప్రభుత్వం నిర్మించతలపెట్టిన ఫోర్త్ సిటీతో కందుకూరు ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. బేగరికంచ నుంచి అగర్‌మియాగూడ మీదుగా నూతనంగా నిర్మించనున్న రోడ్డుకు భూములు ఇవ్వనున్న రైతులతో బుధవారం సాయంత్రం మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో చెరువులు, కుంటలు పూర్తిగా అన్యాక్రాంతమైనట్లు గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలో అనేక పరిశ్రమలను నెలకొల్పనున్నామని, మహేశ్వరం నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందనుందని చెప్పారు. ఆయన వెంట ఏనుగు జంగారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రైతులు తదితరులు ఉన్నారు.

రోడ్డుపై గుంతల పూడ్చివేత

చేవెళ్ల, ఆగస్టు 28 : వర్షాలకు హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై తరచూ గుంతలు ఏర్పడి ప్రమాదాలు చోటుచేసుకుంటున్న విషయాన్ని చేవెళ్ల గ్రామానికి చెందిన గుత్తి మల్లేశ్, బండారు శ్రీకాంత్‌రెడ్డి, మడికట్టు నరేశ్‌రెడ్డి తదితరులు గుర్తించారు. ఈమేరకు బుధవారం రెడిమిక్స్‌తో రోడ్డుపై ఉన్న పెద్ద పెద్ద గుంతలను పూడ్చివేయించారు. కంకర, సిమెంట్‌తో గుంతలను పూడ్చడం పట్ల స్థానికులు, పలువురు వాహనదారులు యువకులను అభినందించారు. కాగా, చేవెళ్ల మండల పరిధిలో ఉన్న ప్రధాన రోడ్లపై గుంతలను పూడ్చివేసేలా చర్యలు తీసుకోవాలని, అందుకు జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రమాదభరితంగా ఉన్న గుంతలను పూడ్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.



గుంతలను పూడ్చివేయిస్తున్న యువకులు

స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

- రాష్ట్ర బీసీ మహాసభ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్



మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తీన్మార్ మల్లన్న, కొమ్ము శ్రీనివాస్ యాదవ్

ఆమనగల్లు, ఆగస్టు 28: స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర బీసీ మహాసభ అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్ యాదవ్ అన్నారు. పాలక ప్రభుత్వాలు బీసీల అణచివేత ధోరణి అవలంబిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను హైదరాబాద్‌లో బుధవారం బీసీ సంఘం నాయకులతో కలిసి శ్రీనివాస్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. కల్వకుర్తి పట్టణంలో సెప్టెంబరు 2న బీసీల రిజర్వేషన్ల పెంపు కోసం చేపట్టే బీసీ మహాధర్నాకు సంబంధించి రూపొందించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను మల్లన్నచే ఆవిష్కరించారు. మహాధర్నాకు హాజరు కావాలని ఆహ్వాన పత్రికను అందజేసినట్లు శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. బీసీల హక్కుల సాధన కోసం రాష్ట్రవ్యాప్త ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. రాజకీయాలకతీతంగా బీసీ నేతలంతా హాజరై విజయవంతం చేయాలని శ్రీనివాస్ యాదవ్ కోరారు. కార్యక్రమంలో నాయకులు అరుణ్, మహేశ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆలయాల అభివృద్ధికి పెద్దపీట

కడ్తాల్, ఆగస్టు 28: ఆలయాల అభివృద్ధి, భక్తుల సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. మండలంలోని మైసిగండి మైసమ్మ ఆలయాన్ని బుధవారం ఎమ్మెల్యే సందర్శించారు. పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, మైసిగండి మాజీ సర్పంచ్ శేఖర్‌గౌడ్‌లతో కలిసి మైసమ్మదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు వెంకటేశ్వర్‌రావు, శ్రీరాములు, శ్రీకాంత్ రెడ్డి, జవహర్ లాల్ నాయక్, వెంకటేశ్, యాదిగిరి, తులసీరామ్ నాయక్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

చౌదరిగూడ, ఆగస్టు 28: మహిళ ఆర్థికంగా బలోపేతం కావాలని జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మహిళ సమాఖ్య భవనంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మంజుల అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం అందించే సబ్సిడీ రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీల్లో కొనసాగుతున్న ఓటర్ల జాబితా మెర్జింగ్ ప్రక్రియలో మహిళా సంఘాల పాత్ర క్రియాశీలకంగా ఉండాలన్నారు. స్థానిక ఎన్నికల్లో మహిళలకు 50శాతం రిజర్వేషన్లు ఉన్నందున్న మొదటగా తమ పేరు ఓటరు జాబితాలో పరిశీలించుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితా తయారు చేసే క్రమంలో పంచాయతీ కార్యదర్శులుకు సహకరించాలని తెలిపారు. వార్డులోని కుటుంబ సభ్యులంతా ఒకే వార్డులో ఉండేలా తగిన సలహాలు, సూచనలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం నర్సింహ, కోశాధికారి లక్ష్మి, కార్యదర్శి రాణి, సీసీలు రమేష్ దేవయ్య, స్వర్ణలత, సభ్యులు పాల్గొన్నారు.

కబ్జాలో 650 ఎకరాలు

- కన్నడిగుల ఆక్రమణలో తెలంగాణ భూమి
- తెలంగాణ-కర్ణాటక సరిహద్దులో సర్వే పూర్తి

బషీరాబాద్/తాండూరు రూరల్, ఆగస్టు 28: తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని అటవీ భూముల ఆక్రమణల సర్వే పూర్తయింది. మూడు రోజులుగా తాండూరు అటవీశాఖ అధికారులు జీపీఎస్ సర్వే చేసి అటవీ ప్రాంతాన్ని నిర్ధారించారు. కర్ణాటక రైతులు 650ఎకరాలకుపైగా తెలంగాణ భూభాగంలోకి చొచ్చుకొచ్చినట్లు అధికారులు నిర్ధారించారు. భూముల వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని అధికారులు చెబుతున్నారు. తాండూరు అటవీ రేంజర్ బి.రాజేందర్ 650 ఎకరాలకుపైగా కర్ణాటక రైతులు కబ్జా చేసినట్లు బుధవారం 'ఆంధ్రజ్యోతి'కి వెల్లడించారు. ఈ నెల 26న అటవీ భూములపై ఆంధ్రజ్యోతిలో 'సరిహద్దు సమస్యపై నజర్' శీర్షికన కథనం ప్రచురితమైంది. ప్రభుత్వం బృందాలను ఏర్పాటుచేసి బషీరాబాద్ మండలం మైల్వార్ రిజర్వు ఫారెస్టు సర్వే నంబరు 235, 218/1, ఇస్మాయిల్‌పూర్ పరిధి సర్వే నంబరు 20, నీళ్లపల్లి పరిధి 35లో, జలాల్‌పూర్‌లో సర్వే నంబర్ 69లో వందలాది ఎకరాలను కబ్జా చేసినట్టు అధికారులు తేల్చారు.

సరిహద్దుల్లో తండాల రైతులు

తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని తండాల కన్నడిగులు ఇక్కడి అటవీ భూములను సాగు చేసుకుంటున్నారు. తండాలన్నీ కర్ణాటక రాష్ట్రం సేడం తాలుకాలోకి వస్తాయి. 650 ఎకరాలకు పైగా కర్ణాటక రైతులు తెలంగాణ భూమి ఆక్రమించారు. రెండు రాష్ట్రాల రైతులు భూముల విషయంలో ఘర్షణ పడుతున్నారు. ముఖ్యమంత్రి, మంత్రుల స్థాయిలో తాండూరు నియోజక వర్గ సరిహద్దు భూముల కబ్జాలపై ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పట్టుబట్టి రంగంలోకి దిగడంతో అటవీ ప్రభుత్వం సర్వే చేయిస్తోంది. సర్వే రిపోర్టును వారం రోజుల్లో కలెక్టర్ నేతృత్వంలో అటవీశాఖ ఉన్నతాధికారులకు అందజేయనున్నారు.

ప్రభుత్వ అనుమతితో జాయింట్ సర్వే

తెలంగాణలో అటవీ భూముల ఆక్రమణ ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో హద్దులను నిర్ణయించేందుకు అటవీ, రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టనున్నారు. అటవీశాఖ నివేదిక ఆధారంగా రెండు రాష్ట్రాల అధికారులు జాయింట్ సర్వే చేపడతారు. సర్వేను సెప్టెంబరులో పూర్తిచేసే అవకాశాలున్నాయి. రెండు రాష్ట్రాల కలెక్టర్ల నేతృత్వంలో ఫైనల్ సర్వే చేయనున్నారు.



తెలంగాణ-కర్ణాటక సరిహద్దు అటవీ భూమిలో సర్వే చేస్తున్న అధికారులు

అట్టహాసంగా విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం

- సంతరించుకున్న ఆధ్యాత్మిక శోభ

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 28: ఫరూఖ్‌నగర్ మండలంలోని మధురాపురం గ్రామంలో చేపట్టిన దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాన్ని బుధవారం అట్టహాసంగా నిర్వహించారు. ఉదయం నుంచి హోమాలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలతో విగ్రహాల ప్రతిష్ఠాపన కొనసాగింది. అనంతరం శివపార్వతుల కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. మధురాపురం గ్రామానికి చెందిన మల్క్యయ్యగారి గోవర్ధన్‌రెడ్డి తన తండ్రి ఎం.రఘురాంరెడ్డి జ్ఞాపకార్థం పంచముఖ శివలింగం, నందీశ్వరుడు, విఘ్నేశ్వరుడు, కుమారస్వామితో పాటు నాగులను ప్రతిష్ఠించారు. లక్నాపురం హరీశ్వర్‌రెడ్డి నవగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆంజనేయస్వామి ఆలయంలో ఒంటి విగ్రహాన్ని కూడా ప్రతిష్ఠించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఆళ్లగడ్డ నుంచి విగ్రహాలను తీసుకువచ్చి, గత మూడు రోజుల నుంచి వేదపండితుల నిర్వహణలో ప్రత్యేక పూజలు చేసి, ప్రతిష్ఠాపనోత్సవాన్ని కొనసాగించారు. గ్రామ మాజీ సర్పంచ్ ఎల్.శివశంకర్‌రెడ్డితో పాటు అధిక సంఖ్యలో గ్రామస్థులు హాజరై భక్తిని చాటుకున్నారు.

కుందుకూరు మండలం తిమ్మాపురంలో

కందుకూరు : మండలంలోని తిమ్మాపురంలో నూతనంగా నిర్మించిన లలిత శివాంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు వైభవంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు వేద పండితులు రెవళ్లె రాజుశర్మ ఆధ్వర్యంలో 108 యజ్ఞగుండాలతో హోమం, పూజలు నిర్వహించిన నిర్వాహకులు.. బుధవారం గణపతి, సుబ్రహ్మణ్య, శివ, నంది, శ్రీలలితాత్రిపుర సుందరీదేవి, ఆంజనేయ, నాగ, శిఖర, నవగ్రహ, ధ్వజస్తంభ దేవతా మూర్తుల యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ చేశారు. చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిలు వేర్వేరుగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, తీగల కృష్ణారెడ్డి, నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, బొక్క జంగారెడ్డి పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మీనర్సింహా రెడ్డి, వట్నాల ఈశ్వర్‌గౌడ్, అమరేందర్‌రెడ్డి, తదితరులున్నారు.

ఘనంగా పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

కేశంపేట/తలకొండపల్లి : మండల కేంద్రంలో మూడు రోజులుగా పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు వైభవంగా కొనసాగుతున్నాయి. పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనతో ప్రధాన గట్టం ముగిసింది. కేశంపేట మాజీ సర్పంచ్ తలసాని వెంకట్ రెడ్డి సొంత నిధులు దాదాపు రూ.12లక్షలతో గ్రామంలోని దళితవాడలో నూతనంగా పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీపీ విశ్వనాథం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మురళీధర్ రెడ్డి, జమాల్‌ఖాన్, మల్లేష్, నాగేష్, రామచెంద్రి, తదితరులు పాల్గొన్నారు. అలాగే తలకొండపల్లి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన శ్రీ పోచమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ రూ. 25 లక్షలతో ఆలయాన్ని నిర్మించారు. బుధవారం ఉదయం హోమం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అర్చకులు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని చేపట్టారు. ఉప్పల వెంకటేశ్‌ను నిర్వాహకులు సత్కరించారు. మాజీ సర్పంచ్ లలితజ్యోతయ్య, నాయకులు జగదీశ్వర్, యాదయ్య, సాయిలు, మల్లేశ్, నర్సింహ్మా, రమేశ్, యాదయ్య, భక్తులు పాల్గొన్నారు. కాగా, తలకొండపల్లి శ్రీపోచమ్మ ఆలయాన్ని ఎమ్మెల్యే నారాయణ రెడ్డి, రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యుడు బాలాజీ సింగ్‌లు సందర్శించారు. పోచమ్మ దేవతకు పూజలు నిర్వహించారు. ఆలయ మర్యాదలతో వారిని సత్కరించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



షాద్‌నగర్ అర్బన్ : శివలింగం, నంది, విఘ్నేశ్వరుడు నాగులు, నవగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు



కేశంపేట : పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, తలసాని వెంకట్‌రెడ్డి



కందుకూరు: దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కేఎల్లార్, తీగల కృష్ణారెడ్డి



తలకొండపల్లి : వేడుకల్లో ఉప్పల వెంకటేశ్



ఆక్రమణలను తక్షణమే తొలగించాలి

- బడాబాబుల నుంచి పరిహారం వసూలు చేయాలి
- హైడ్రా కమిషనర్‌కు వజ్రేష్‌యాదవ్ వినతి

మేడ్చల్ ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూముల్లోని నిర్మాణాలను తొలగించాలని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ మేడ్చల్ ఇన్‌చార్జి, పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు బుధవారం వినతి పత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి జిల్లాతో పాటు మేడ్చల్ మండలం నల్లకుంట చెరువు సర్వే నంబరు 33లో 13ఎకరాల్లో మల్లారెడ్డి సీఎంఆర్ మెడికల్ కాలేజీ, కోమటికుంట సర్వే నంబరు 647లో 20ఎకరాల్లో చేపట్టిన మల్లారెడ్డి యూనివర్సిటీ, నీలా చెరువు సర్వే నంబరు 428లో 5ఎకరాల 30గుంటలు కబ్జా చేసి చేపట్టిన అపర్ణ నిర్మాణాలు, సర్వే నంబరు 29లో 14ఎకరాలు 3గుంటల భూమిలో కమర్షియల్ నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. మల్లారెడ్డి అల్లుడు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి చెందిన నిర్మాణాలు చెరువులు, కుంటల్లో ఉన్నాయని, ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అనురాగ్ విద్యాసంస్థలు, నీలిమ హాస్పిటల్ భవనాలను కూడా చెరువులను ఆక్రమించే చేపట్టారని ఆరోపించారు. పూడూరులో ఓ బీజేపీ నేత అల్లుడు చెరువును ఆక్రమించాడని వినతిపత్రంలో వివరించారు. కబ్జాచేసి చేపట్టిన నిర్మాణాలను హైడ్రా కూల్చివేయాలని కోరారు.

వందశాతం రుణమాఫీకి ప్రభుత్వం సిద్ధం

- సాంకేతిక లోపాలను సరిచేయండి
- బ్యాంకర్లు, అధికారులతో సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 28: సాంకేతిక లోపాలను సరిచేసి, రైతులందరికీ రుణమాఫీ చేసి మళ్లీ రుణం పొందే అర్హతను కల్పించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదేశించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో బుధవారం బ్యాంకర్లు, వ్యవసాయాధికారులతో రుణమాఫీపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అర్హత కలిగిన ప్రతీ రైతుకు రుణమాఫీ వర్తింపజేయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఆయన తెలిపారు. మూడు విడుతల్లో రుణమాఫీ వర్తించని రైతుల పేర్లు, కారణాలను రాసి ఇవ్వాలని బ్యాంకర్లను కోరారు. బ్యాంకర్లు ఇచ్చిన జాబితా ఆధారంగా వ్యవసాయశాఖ అధికారులు నేరుగా రైతులను కలిసి, నివేదికను సిద్ధం చేస్తారని శంకర్ అన్నారు. వ్యవసాయశాఖకు కాంగ్రెస్ క్యాడర్ కూడా సహకారం అందిస్తుందని తెలిపారు. వ్యవసాయశాఖ ఇచ్చే నివేదికను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, ప్రతీ రైతుకు రుణమాఫీ అయ్యేలా, తిరిగి మళ్లీ రుణం పొందేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే తెలిపారు. రైతు రుణమాఫీ అంశంపై బ్యాంకర్లు, వ్యవసాయాధికారులు ఏమాత్రం నిర్లక్ష్యం చేయవద్దని వీర్లపల్లి శంకర్ సూచించారు.



బ్యాంకర్లు, వ్యవసాయాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

సర్వశిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



కలెక్టరేట్ కాంప్లెక్స్ వద్ద ధర్నా చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

వికారాబాద్/కొడంగల్ రూరల్, ఆగస్టు 28 : విద్యాశాఖలో వివిధ పోస్టుల్లో పనిచేస్తున్న 21,000 మంది ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంగ్యానాయక్ డిమాండ్ చేశారు. బుధవారం వికారాబాద్‌లో ఉద్యోగులతో ర్యాలీ నిర్వహించి అనంతరం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించే చర్యలు తీసుకోవాలన్నారు. ఇచ్చిన మాటను నిలుపుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్, స్వప్నరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కొడంగల్ సమగ్ర శిక్ష ఉద్యోగులు రాఘవేందర్, శ్రీనివాస్, శంకరయ్య, వేణుగోపాల్, నాగరాజ్, వెంకట్‌రావు, కృష్ణ, దస్తప్ప, వెంకటయ్య అన్నారు. వారు కలెక్టరేట్ వద్ద చేసిన నిరసనలో పాల్గొన్నారు.

హిందువులకు వీహెచ్‌పీ వెన్నెముక

కందుకూరు, ఆగస్టు 28: ప్రతీ హిందువుకు వీహెచ్‌పీ వెన్నెముకలాంటిదని, హిందూ ధర్మం కోసం ప్రతీఒక్కరు రాజకీయాలకతీతంగా కలిసి రావాలని వీహెచ్‌పీ విభాగ్ సంఘటన్ మంత్రి వెలుగు సాయిరామ్ కోరారు. మంగల కేంద్రంలోని సీతారామశాస్త్రీ కల్యాణమండపంలో బీహెచ్‌పీ మండల ప్రఖండ అధ్యక్షుడు ఎగ్గిడి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. వీహెచ్‌పీని స్థాపించి 60 సంవత్సరాలు పూర్తయ్యిందని గుర్తు చేశారు. లయన్స్‌క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి మాట్లాడారు. వీహెచ్‌పీ రాజకీయాలు, కులాలు, మతాలకు అతీతంగా దేశ సంస్కృతిపట్ల నిరంతరం పనిచేస్తున్నట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ విభాగ్ కార్యదర్శి మధురమోని సురేష్, జిల్లా నాయకులు రాజేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, మండల రాజు, కె.నర్సింహ, ఈశ్వర్, రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న సాయిరామ్, తదితరులు



తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఒసార్ట్ సంస్థ ప్రతినిధులు

పేద విద్యార్థులకు వసతుల కల్పనే ధ్యేయం

మేడ్చల్ టౌన్, ఆగస్టు 28 : మారుమూల ప్రాంతాల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి సదుపాయాలు కల్పించాలనే సంకల్పంతోనే తమ సంస్థ పాఠశాలల్లో అదనపు తరగతి గదులను నిర్మిస్తోందని తెలంగాణ రాష్ట్ర ఒసార్ట్(వన్ స్కూల్ ఎట్ ఎ టైమ్) సంస్థ ప్రతినిధి నర్సింహారావు అన్నారు. రూ.కోటితో డబిల్‌పూర్‌లో నిర్మిస్తున్న ఐదు తరగతి గదుల నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ.. యూఎస్‌లో ఉండే ఎన్ఆర్ఐలు, దేశంలోని సాఫ్ట్‌వేర్ సంస్థలు ఈ సంస్థను ఏర్పాటు చేశాయన్నారు. ఇప్పటి వరకు 109 ప్రాజెక్టులు చేపట్టి తరగతి గదులు నిర్మించామన్నారు. 110వ ప్రాజెక్టు కింద డబిల్‌పూర్ పాఠశాలను ఎంపిక చేశామన్నారు. ప్రాజెక్టును డబిల్‌పూర్ స్కూల్లో ప్రారంభించేందుకు ప్రజాప్రతినిధులు, టీచర్లు సహకరించారన్నారు. ఇక్కడ 400కుపైగా విద్యార్థులున్నారని, వారికి సదుపాలు కల్పించేందుకే ఇక్కడ ప్రాజెక్టును చేపట్టామన్నారు. ఒసార్ట్ సంస్థకు గ్రామస్తులు రుణపడి ఉంటారని మాజీ ఎంపీపీ రజిత, మాజీ సర్పంచ్ గీత అన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు రాజమల్లారెడ్డి, భాగ్యరెడ్డి, అశోక్, సత్యనారాయణ, సంజీవయ్య, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కోసం పరుగులు

- దరఖాస్తులు అందజేస్తున్న రైతులు

కొడంగల్ రూరల్/కులకచర్ల, ఆగస్టు 28: మూడో విడత 2లక్షల లోపు పంటరుణం మాఫీ కాని రైతులు గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసుకుంటున్నారు. రెండు లక్షల లోపు రుణం తీసుకున్న రైతులు వడ్డీతో కలిపి 2లక్షలకు పైగా ఉందని, అందులో నుంచి 2లక్షలు కూడా మాఫీ కాలేదని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్నారు. భార్యభర్తలు రుణాలను తీసుకున్న వారిలో ఒక్కరికి కూడా మాఫీ కాలేదని మొరపెట్టుకుంటున్నారు. కొందరు పంటరుణం రెన్యూవల్ చేసుకున్న వారికి రుణమాఫీ కాలేదని చెబుతున్నారు. దీంతో కార్యాలయంలోని గ్రీవెన్ సెల్‌లో దరఖాస్తు చేసుకుంటున్నారు. మూడు, నాలుగు రోజుల నుంచి కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్‌కు రైతులు దరఖాస్తుతో పాటు రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, రుణ ఖాతా స్టేట్‌మెంట్, పట్టా పాస్‌బుక్ జిరాక్స్ కాపీలను అందజేస్తూ ఫిర్యాదు చేస్తున్నారు. రుణమాఫీ అందలేదని 220మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారని కులకచర్ల ఏవో వీరస్వామి తెలిపారు. రుణమాఫీ కాని రైతుల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించామన్నారు.



రుణమాఫీ కోసం దరఖాస్తు చేస్తున్న రైతులు



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

కల్యాణలక్ష్మితో పేదలకు భరోసా

షాబాద్, ఆగస్టు 28 : ఆడపిల్లల పెళ్లి చేసేందుకు తల్లిదండ్రులు పడే కష్టాన్ని కళ్లారా చూసిన సీఎం రేవంత్‌రెడ్డి నిరుపేదలకు కల్యాణలక్ష్మితో భరోసా ఇస్తున్నారని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. బుధవారం షాబాద్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో 37 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు. తహసీల్దార్ అన్వర్, ఎంపీడీవో అపర్ణ, డీటీ మధు, తదితరులు పాల్గొన్నారు.

అపరిచితుల మాటలు విశ్వసించొద్దు



అవగాహన కల్పిస్తున్న ఎస్సై సత్యనారాయణ

యాచారం, ఆగస్టు 28 : అపరిచిత వ్యక్తుల మాటలు విశ్వసించరాదని, ఎవరైనా ప్రేమ పేరుతో వేధిస్తే డయల్ 100కు కాల్‌చేసి సమాచారమందించాలని ఎస్సై సత్యనారాయణ తెలిపారు. బుధవారం సైకిల్‌పై మండల కేంద్రంలో పలు వార్డులు, సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై తిరిగి సైబర్ నేరాలు, ఇతర నేరాలపై బాలికలకు, మహిళలకు అవగాహన కల్పించారు. యాచారం బస్టాండ్‌లో మహిళలను, బాలికలను కలిసి వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. సకాలంలో బస్సులు రాకపోతే తల్లిదండ్రులకు ఫోన్‌చేసి చెప్పాలన్నారు.

రుణమాఫీపై ఆందోళన వద్దు

- రంగారెడ్డి జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు
- రుణమాఫీపై కుటుంబ నిర్ధారణ సర్వే షురూ

యాచారం, ఆగస్టు 28 : రుణమాఫీ విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని, అర్హులైన ప్రతీ ఒక్కరికి మాఫీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో రేషన్ కార్డులు లేని రైతుల కుటుంబ నిర్ధారణ సర్వే చేస్తున్నామని, రుణమాఫీ వర్తించని రైతుల వివరాలు సేకరిస్తున్నామని చెప్పారు. బుధవారం సాయంత్రం యాచారం మండల కేంద్రంలో రుణమాఫీ వర్తించని రైతుల కుటుంబ నిర్ధారణ సర్వే విధానంపై మండల వ్యవసాయాధికారులకు ఆయన అవగాహన కల్పించారు. అనంతరం పలువురు రైతులను కలిసి రుణమాఫీపై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డు ఉన్న ప్రతీ రైతుకు విధిగా రుణమాఫీ వర్తించిందని. ఎ క్కడైనా సమస్యలు ఉంటే వారికి కూడా రుణమాఫీ వర్తించేట్లు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. రుణమాఫీ వర్తించలేదని రైతులు ఆందోళన చెందరాదన్నారు. రైతులు రుణమాఫీ దరఖాస్తులను ఆధార్, రేషన్‌కార్డు, పట్టా పాస్‌బుక్ జిరాక్స్ కాపీలతో కలిపి వ్యవసాయాధికారికి ఇస్తే ఆన్‌లైన్‌లో



యాచారం : వివరాలు తెలుసుకుంటున్న జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు

పరిశీలన చేసి చెబుతారని తెలిపారు. రుణమాఫీ వర్తించలేని వారందరికి రూ.రెండు లక్షల్లోపు మాఫీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. మండల వ్యవసాయాధికారి రవీంద్రనాథ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల : రుణాలు మాఫీకాని రైతుల వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు ఏవో శంకర్‌లాల్ తెలిపారు. చేవెళ్ల మండల వ్యవసాయాధికారులు గ్రామాలవారిగా పంటరుణాలు మాఫీ కాని రైతుల వివరాలను సేకరించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆయన మాట్లాడుతూ రైతులకు రేషన్ కార్డులో ఉన్న కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్, భూమి సర్వేనెంబర్ ఇతర వివరాలు పరిశీలించి నమోదు చేస్తున్నట్లు తెలిపారు. రుణమాఫీ కాని రైతులు వివరాలను దరఖాస్తులో నింపి వ్యవసాయ కార్యాలయంలో ఇవ్వచ్చని స్పష్టం చేశారు.



చేవెళ్ల : వివరాలు సేకరిస్తున్న ఏవో శంకర్‌లాల్

ఆమనగల్లు : సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతుల వివరాలను కుటుంబాల వారిగా సేకరించడం జరుగుతుందని మండల వ్యవసాయ శాఖ అధికారి పి. శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. వివరాల సేకరణ కోసం బుధవారం నుంచి సెప్టెంబరు 6వ తేదీ వరకు గ్రామాలవారిగా సర్వే నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సేకరించిన వివరాలను పోర్టల్‌లో నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో రైతులు అందుబాటులో ఉండి కుటుంబ నిర్ధారణ చేసుకోవాలని శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. 28, 29 తేదీల్లో ఆమనగల్లు వ్యవసాయశాఖ కార్యాలయం, 30న ఆకుతోటపల్లి, శెట్టిపల్లి, 31న మంగళపల్లి, చింతలపల్లి, సెప్టెంబరు 2న కోనాపూర్, సీతారామ్‌నగర్ తండా, 3న మేడిగడ్డ, సంకటోనిపల్లి, 4న పోలెపల్లి, కొత్తకుంట తండా, 5న సింగంపల్లి, చెన్నంపల్లి, 6న రాంనుంతలలో వ్యవసాయ శాఖ ద్వారా రైతుల కుటుంబ నిర్ధారణ చేయడం జరుగుతుందన్నారు. రైతులందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శ్రీనివాస్‌గౌడ్ కోరారు.

చౌదరిగూడ : అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ వర్తిస్తుందని మండల వ్యవసాయాధికారి రాజేందర్‌రెడ్డి సూచించారు. కుటుంబ సభ్యుల నిర్ధారణ వివరాలను యాప్‌లో నమోదు చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. గుర్రంపల్లి, ఇంద్రనగర్ గ్రామాలను ఏవో పర్యటించారు. ఈనెల 28 నుంచి సెప్టెంబరు 20 వరకు ప్రతీ గ్రామాన్ని సందర్శించి రుణమాఫీకి అర్హులైన రైతుల వివరాలను ఆన్‌లైన్ ద్వారా యాప్‌లో నమోదు చేయనున్నట్లు చెప్పారు. రూ.2లక్షల రుణం పొందిన రైతులు అపోహలు పెట్టుకోవద్దని, త్వరలో రుణమాఫీపై షెడ్యూల్ ప్రకారం మిగతా సొమ్ము ఎప్పుడు చెల్లించాలో ప్రభుత్వం నిర్ణయిస్తుందన్నారు.



చౌదరిగూడ : వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్న ఏవో రాజేందర్‌రెడ్డి

అంబరాన్నంటిన బోనాల సంబరాలు

- ఆకట్టుకున్న పోతరాజుల విన్యాసాలు
- బోనం కుండలతో మహిళల ర్యాలీ

కడ్తాల్, ఆగస్టు 28 : గండి మైసమ్మ తల్లో.. మమ్ము చల్లంగా చూడంటూ.. మైసిగండిలో భక్తులు మైసమ్మ దేవతను వేడుకున్నారు. బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఏడాదికోసారి జరుపుకునే బోనాల వేడుక కడ్తాల మండలం మైసిగండి గ్రామంలో అంబురాన్నంటింది. గౌడ సంఘం ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం మైసమ్మ బోనాలు ఘనంగా జరుపుకున్నారు. జిల్లాలో ప్రసిద్ధి గాంచిన మైసిగండి మైసమ్మ బోనాలకు వివిధ ప్రాంతాలలో ఉన్న స్థానికులు, వారి బంధువులు, సమీప గ్రామస్థులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఉదయం పీసీసీ సభ్యుడు సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ శేఖర్‌గౌడ్, గౌడ సంఘం నాయకుల ఆధ్వర్యంలో గౌడ కులస్థులు మైసమ్మకు క్షీరాభిషేకం,



కందుకూరు : కొత్తగూడలో కట్టమైసమ్మ బోనాల ఊరేగింపులో గ్రామస్తులు

ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, కడ్తాల మాజీ ఎంపీపీలు కమ్లీమోత్యానాయక్, సిరోలిపంతూ, మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, మాజీ సర్పంచ్ తులసీరామ్ నాయక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యానాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, తహసీల్దార్ ముంతాజ్, సీఐ శివప్రసాద్, ఎస్ఐ వరప్రసాద్‌లు హాజరయ్యారు. మైసమ్మ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గౌడ సంఘం నాయకులు, స్థానిక నేతలు వెంకటేశ్‌గౌడ్, యాదగిరి గౌడ్, సత్యనారాయణ, గణేశ్, తదితరులున్నారు.



ఆమనగల్లు : బోనాల ఊరేగింపు..

ఆమనగల్లు : పట్టణంలో పోచమ్మ బోనాలు స్థానిక పూసల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల వేడుక అంబరాన్నంటింది. వేడుకకు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, మాజీ జడ్పీటీసీ అనురాధపత్యానాయక్, లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. సాయంత్రం మహిళలు బోనం కుండలను అలంకరించుకొని ర్యాలీగా ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పూసల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పస్పులేటి సత్యం, అధ్యక్షుడు వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి భాస్కర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాడ్గుల : బోనాలతో తరలిన మహిళలు

మాడ్గుల : మండలంలోని నల్లచెర్వు గ్రామంలో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. గ్రామదేవతలకు నీటితో అభి షేకం చేసి, పూజలు చేశారు. మహిళలు బోనాలతో తరలివెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కృష్ణారెడ్డి, మల్లయ్య, బూతరాజు రమేష్, కట్ట అంజయ్య, కట్ట జగన్, కట్ట నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : మండలంలోని కొత్తగూడ, పులిమామిడి, ధన్నారం గ్రామాల్లో బోనాలు వైభవంగా జరుపుకున్నారు. కొత్తగూడలో కట్టమైసమ్మ, పులిమామిడిలో మల్లన్న బోనాలు, ధన్నారంలో పోచమ్మ భోనాలను జరుపుకున్నారు. మాజీ సర్పంచ్‌లు సాద మల్లారెడ్డి, అనీతశ్రీనివాస్, శ్రీదేవిశేఖర్‌రెడ్డి, అనేగౌని దేవిపాండుగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ సంధ్యాదామోదర్‌గౌడ్, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

యాచారం : మండలంలోని కుర్మిద్దలో యాదవులు శ్రీ సోమన్న బోనాల ఉత్సవాలు జరుపుకున్నారు. మహిళలు వివిధ రకాల వంటకాలతో పాటు నెయ్యి, వెన్న, బెల్లం, ఇతర పదార్థాలతో బోనం తయారు చేసి కొత్తగంపలో ఎత్తుకొని వాడవాడల్లో ఊరేగించారు. సాయంత్రం స్వామివారికి సమర్పించారు. గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది.



యాచారం : కుర్మిద్దలో సోమన్న బోనాల ఊరేగింపులో గ్రామస్తులు

ఆలయ నిర్మాణానికి విరాళాలు

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 28: ఫరూఖ్‌నగర్ మండలంలోని మొగిలిగిద్ద గ్రామంలో నిర్మిస్తున్న ఆంజనేయ స్వామి ఆలయ గర్భగుడిలో గ్రానైట్ వేయడానికి అదే గ్రామానికి చెందిన స్వర్గీయ పిల్లి బాలయ్య కుమారులు 65వేల రూపాయల విరాళం ఇచ్చారు. అలాగే స్థానిక బుగ్గారెడ్డి హాస్పిటల్ యాజమాని మనోహర్‌రెడ్డి పదివేల రూపాయలు, మొగిలిగిద్ద గ్రామానికి చెందిన గుడుపల్లి రవి 5,100 రూపాయలను విరాలంగా ఇచ్చారు. దాతల ఔదార్యానికి ఆలయ నిర్మాణ కమిటి కన్వీనర్లు కక్కునూరి వెంకటేశ్‌గుప్త, ఆన్మారి వెంకటయ్యలు కృతజ్ఞతలు తెలిపారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

ఆమనగల్లు, ఆగస్టు 28: మెనూ ప్రకారం విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో కుసుమ మాధురి కోరారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. షాబాద్‌లో కొనసాగుతున్న ఆమనగల్లు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలను బుధవారం ఎంపీడీవో సందర్శించారు. రికార్డులు, పరిసరాలు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, ఆర్‌వో ప్లాంట్, భోజనశాలను ఆమె పరిశీలించారు. విద్యార్థినిలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నడుచుకోవాలని అధికారులకు సూచించారు.

విద్యుత్ సంస్కరణలపై మొండి వైఖరిని విడనాడాలి

మహేశ్వరం, ఆగస్టు 28 : కేంద్ర ప్రభుత్వం విద్యుత్తు సంస్కరణలపై అనుసరిస్తున్న మొండి వైఖరి విడనాడి రైతులకు మేలు జరిగేలా చట్టాలు తేవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ అన్నారు. బుధవారం మహేశ్వరంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అలువాల రవి కుమార్ ఆధ్వర్యంలో విద్యుత్ అమర వీరులకు నివాళి కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ 2000లో ఆగస్టు 28న బషీరాబాద్‌లో జరిగిన విద్యుత్ ఉద్యమ పోరాటంలో అమరులైన కామ్రేడ్ రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామిలు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. చంద్రమోహన్, రాజు, కవిత, కిషన్, శేఖర్, పెంటయ్య, నర్సింహ, రాములు, ప్రవీణ్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



అమరవీరులకు నివాళి అర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

సామాజిక సేవా కార్యక్రమాల్లో పోటీ పడాలి

తలకొండపల్లి, ఆగస్టు 28: సామాజిక సేవ, ప్రజాచైతన్య కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు పోటీ పడాలని ఆమనగల్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ లు పిలుపునిచ్చారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలనిత వారు కోరారు. తలకొండపల్లి మండలం వెంకట్రావ్ పేట గ్రామంలో బుధవారం ఆమనగల్లు లయన్స్‌క్లబ్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కామినేని ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ అఖిల్, లయన్స్ క్లబ్ సభ్యులతో కలిసి ఉప్పల వెంకటేశ్, లక్ష్మారెడ్డిలు శిబిరాన్ని ప్రారంభించారు. 236 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

మాజీ సర్పంచ్ ఉదారత్వం..
మాల కులస్థులకు కమ్యూనిటీహాల్ నిర్మాణం

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 28: ఫరూఖ్‌నగర్ మండలంలోని మధురాపురం మాజీ సర్పంచ్ ఎల్.శివశంకర్‌రెడ్డి సొంత డబ్బుతో మాల కులస్థులకు కమ్యూనిటీ హాలును నిర్మించి ఇచ్చారు. వారి కోరిక మేరకు నిర్మించిన కమ్యూనిటీ హాలును బుధవారం శివశంకర్‌రెడ్డి తల్లిదండ్రులు రామేశ్వరమ్మ, దామోదర్‌రెడ్డిలు ప్రారంభించారు. హాలును నిర్మించి ఇచ్చిన మాజీ సర్పంచ్‌కు మాల కులస్థులు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ వార్డు సభ్యురాలు తుప్పరి సుభాషిణి గణేష్‌లు పాల్గొన్నారు.



కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవంలో మాల కులస్తులు, తదితరులు

సంక్షిప్తంగా..

కడ్తాల్ : పేదింటి ఆడబిడ్డ పెళ్లికి జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, కడ్తాల జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ చేయూత నందించారు. పోచమ్మగడ్డ తండాకు చెందిన జర్పుల శాంతిపాండు దంపతుల కూతురు గీత వివాహం సందర్భంగా ట్రస్ట్ ద్వారా రూ. 21 వేలు సమకూర్చారు. నగదుతో పాటు పట్టు చీరను బహూకరించారు.

కడ్తాల్ : శ్రీకృష్ణాజన్మాష్టమి వేడుకలు కడ్తాల మండలం రావిచెడ్ గ్రామంలో బుధవారం యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద నిర్వహించిన వేడుకల్లో స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి మాజీ ఎంపీటీసీ బొప్పిడి గోపాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉట్లు కొట్టే కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉట్ల కార్యక్రమంలో గోపాల్ మొదటి బహుమతి కింద రూ.వెయ్యి ప్రోత్సాహకం అందజేశారు. రంగయ్య, రాములు, తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లి : మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని మండల ప్రత్యేక అధికారి ముత్యాలు, ఎంపీడీవో శ్రీకాంత్‌లు సందర్శించారు. పాఠశాల రికార్డులు, పరిసరాలు, వంటకాలను, నూతనంగా నిర్మిస్తున్న గదులను పరిశీలించారు. విద్యార్థులతో సమావేశమై వారి బోధన సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. వారి సమస్యలను తెలుసుకొని ఎస్‌వో కు పలు సూచనలు చేశారు. మెను ప్రకారం భోజనం అందించాలని ఎస్‌వో రేణుక కు సూచించారు.

కడ్తాల్ : మండల కేంద్రంలోని సాయిమందిరంలో మూడు రోజులపాటు కొనసాగే శ్రీ లలితాపరమేశ్వరి దేవీ విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఎలికంటి జ్ఞాన ప్రసూనాంభ శర్మ ఆధ్వర్యంలో తొలిరోజు దేవాలయ ప్రవేశం, గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, అంకురార్పణ, అఖండ దీపారాధన, మూల మంత్రహవనం, రుద్రహోమం, అగ్నిప్రతిష్ఠ ప్రదోష పూజలు నిర్వహించారు. అనంతరం రాష్ట్రపతి సాహిత్య పురస్కార అవార్డు గ్రహీత డాక్టర్ శ్రీ దీక్షుతుల సుబ్రమణ్యంచే ఆధ్యాత్మిక, అన్నమాచార్య సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్, తదితరులున్నారు.

తలకొండపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చేస్తున్న కృషికి తోడు దాతలు, స్వచ్ఛంద సంస్థలు, పూర్వ విద్యార్థులు చేయూతనందించాలని లయన్స్‌క్లబ్ సభ్యుడు, పీసీసీ కిసాన్ సెల్‌రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు మోహన్‌రెడ్డి రూ.50వేలు ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సి లక్ష్మీకి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. మోహన్‌రెడ్డిని స్థానికులు, ఉపాధ్యాయులు అభినందించి సత్కరించారు. కండె ఓంకారం, మిట్టపల్లి అంజయ్య, సునంద, జూలూరి రమేశ్, గుజ్జరి నర్సింహ్మా, పండుగ అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బొడ్రాయి వేడుకలు

కడ్తాల్, ఆగస్టు 28: మండల పరిధిలోని గాన్గుమర్ల తండాలో బొడ్రాయి వార్షికోత్సవం బుధవారం అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజలు కొనసాగాయి. గిరిజనులు పెద్ద సంఖ్యలో వేడుకల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. బొడ్రాయి వద్ద నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ సేవ్యానాయక్, మాజీ సర్పంచ్ హంసమోత్యానాయక్, బీజేపీ గిరిజనమోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శంకర్‌నాయక్, నాయకులు శ్రీనునాయక్, భీమన్ నాయక్, పాండు నాయక్, సక్రు నాయక్, రూప్ సింగ్, పంతూనాయక్, లక్ష్మణ్, గణేశ్, పత్య, వాల్య, తదితరులు పాల్గొన్నారు.



బొడ్రాయి వార్షికోత్సవంలో నాయకులు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి.. భార్యకు తీవ్ర గాయాలు

షాద్‌నగర్ రూరల్, ఆగస్టు 28: షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎలికట్ట శివారులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందగా భార్యకు తీవ్ర గాయాలైనాయి. పోలీసుల కథనం ప్రకారం వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం విఠలాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి మహేష్(35), అతడి భార్య సునీత హైతాబాద్ దగ్గర వెంకటాపూర్ సమీపంలో జరిగిన బంధువుల ఫంక్షన్ కోసం బైక్‌పై వెళ్లి వస్తుండగా మార్గమధ్యలో ఎలికట్ట చౌరస్తా సమీపంలో వెనుక నుంచి లారీని ఢీకొట్టారు. ప్రమాదంలో మహేష్ అక్కడికక్కడే మృతి చెందగా భార్య సునీతకు రెండు కాళ్లు విరిగాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

కోనాపూర్ గేటు వద్ద గొర్రెల కాపరి..

ఆమనగల్లు, ఆగస్టు 28: మండల పరిధిలోని కోనాపూర్ గేటు వద్ద హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి మృతిచెందాడు. మహబూబ్‌నగర్ జిల్లా ధన్వాడ మండలం హనుమాన్‌పల్లికి చెందిన గొర్రెల కాపరి ఆంజనేయులు గొర్రెలను మేపుకుంటూ వెళ్తున్నాడు. ఆమనగల్లు మండలం కోనాపూర్ గేటు వద్ద హైదరాబాద్ నుంచి కల్వకుర్తి వైపు వెళ్తున్న డీసీఎం గొర్రెల వెంట నడుచుకుంటూ వెళ్తున్న ఆంజనేయులును ఢీకొంది. దాంతో తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతుండగా అదే సమయంలో అటు నుంచి వెళ్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్, అంబేడ్కర్ యువజన సంఘం నాయకుడు ఎంఏ హఫీజ్, కొందరు యువకులు ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు. కాగా, ఈ ప్రమాదంలో 10 గొర్రెలు కూడా మృతి చెందాయి.

కుటుంబ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

ఆదిభట్ల, ఆగస్టు 28 : కుటుంబ సమస్యలతో మానసిక వేదనకు గురై ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాపూర్ మండలం జిల్లెలగూడకు చెందిన సిద్దిపేట ప్రభాకర్‌రెడ్డి (45) కొంత కాలంగా కుటుంబంలో కలహాలు, ఇతర సమస్యలతో బాధపడుతున్నాడు. బుధవారం ఉదయం ఇప్పుడే వస్తానని చెప్పి ఇంట్లో నుంచి బయలు దేరి ఆదిభట్లలోని ఓవెంచర్‌లో కంటైనర్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది యువకుడు..

కేశంపేట, ఆగస్టు 28: జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు ఉరేసుకొని మృతిచెందిన సంఘటన కేశంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని వేముల్‌నర్వ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గంజాయి ప్రమోద్((30), మహేశ్వరం గ్రామానికి చెందిన కృపను ఆరేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. మూడు సంవత్సరాలు సాఫీగా సాగిన సంసారంలో ఇటీవల గొడవలు మొదలయ్యాయి. ప్రమోద్ మద్యానికి బానిసవ్వడంతో తరచూ భార్యతో గొడవ జరిగేది. నాలుగు నెలల క్రితం కృప భర్తను వదిలి పుట్టింటికి వెళ్లిపోయింది. అయితే, భార్యాభర్తలు తరచూ ఫోన్‌లో గొడవ పడుతుండేవారు. ఈక్రమంలో మంగళవారం రాత్రి భార్యతో గొడవ పడిన ప్రమోద్.. తను ఉంటున్న గుడిసెలో ఉరేసుకొని మృతి చెందాడు. మృతుడి తల్లి జంగమ్మ బుధవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి

కేశంపేట, ఆగస్టు 28: విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతిచెందిన ఘటన కేశంపేట పోలీస్‌స్టేషన్ పరిధి సంతాపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై రాజ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సంతాపూర్ గ్రామానికి చెందిన జిజారం నర్సింహ(40) ఎలక్ట్రీషియన్. మంగళవారం కొత్తపేట గ్రామానికి చెందిన గొల్లపల్లి చెన్నయ్యతో కలిసి పాటిగడ్డ సమీపంలో విద్యుత్ స్తంభానికి వైర్లు అమర్చుతుండగా కరెంట్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే అంబులెన్స్‌లో షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించి అనంతరం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఆగిర్యాలలో ఆవు మృత్యువాత

కొందుర్గు, ఆగస్టు 28: విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఆగిర్యాలలో జరిగింది. గ్రామస్థుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కూర బాలకిష్టయ్య తన పొలం వద్ద ఉన్న పశువుల కొట్టంలో ఆవును మంగళవారం రాత్రి కట్టేసి ఇంటికి వచ్చాడు. బుధవారం ఉదయం వెళ్లి చూడగా పొలంలో ఉన్న విద్యుత్ స్తంభం విరిగి పడిపోయింది. ఆవు మృతిచెంది ఉండటంతో విద్యాదాఘాతంతో చనిపోయిందని బోరున విలపించాడు. చనిపోయిన ఆవు విలువ దాదాపు రూ.80వేల వరకు ఉంటుందని, తనకు ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని బాధిత రైతు బాలకిష్టయ్య కోరాడు.

ఘనంగా వీహెచ్‌పీఎస్ ఆవిర్భావ వేడుకలు

ఇబ్రహీంపట్నం/యాచారం, ఆగస్టు 28: వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) 18వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం ఇబ్రహీంపట్నంలో వీహెచ్‌పీఎస్ జెండాను ఆవిష్కరించారు. వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాల్ల జంగయ్య మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఏర్పాటు చేసిన వీహెచ్‌పీఎస్‌తోనే వికలాంగులకు గుర్తింపు వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు హామీ మేరకు వికలాంగులకు పెన్షన్లు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రవీణ్‌కుమార్, బండమీది కృష్ణ, వీహెచ్‌పీఎస నాయకులు కె.శ్రీనివాస్, గువ్వల యాదయ్య, బాల్‌రాజ్, సంజీవ తదితరులు పాల్గొన్నారు. అలాగే దివ్యాంగుల హక్కులను కాపాడేందుకు ప్రతీవ్యక్తి చొరవ తీసుకోవాలని యాచారం మండల కాంగ్రెస్ నాయకులు పడకంటి శేఖర్‌గౌడ్ అన్నారు. మాల్‌లో జెండాను ఆవిష్కరించారు. అనంతరం పలువురు దివ్యాంగులను ఆయన ఘనంగా సత్కరించారు. మాజీ సర్పంచ్ బెల్లి జంగయ్యాయాదవ్, నాయకులు గుండ్లపల్లిమురళి, బాలకృష్ణ, శివకృష్ణ, బట్టు శ్రీనివాస్, వి.తిరుమలేష్, నర్సింహ తదితరులున్నారు.



జెండా ఎగరవేస్తున్న జంగయ్య



దివ్యాంగులను సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకుడు శేఖర్‌గౌడ్

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

కడ్తాల్, ఆగస్టు 28: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా ఎంపీటీసీల సంఘం మాజీ కార్యదర్శి, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బొప్పిడి గోపాల్ అన్నారు. కడ్తాల మండలం రావిచెడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడా సామగ్రి కొనుగోలుకు గోపాల్ చేయూతనందించారు. రూ.11వేలు బుధవారం పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు స్వరూప, పీడీ సాబేర్‌కు గోపాల్ అందజేశారు. వారు గోపాల్‌ను సత్కరించి అభినందించారు. మాజీ ఎంపీటీసీ రంగయ్య, నాయకులు బీరప్ప, శ్రీశైలం, కృష్ణయ్య, యాదయ్య, సాయికుమార్, ఉపాధ్యాయులు అశోక్, సతీష్, రమేశ్, మంజుల, వినోద్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న బొప్పిడి గోపాల్